# "నాకూ ఆడదానిగా పుట్టాలనుంది"

## యస్. భారతీదేవి

రాత్రి ఎనిమిది గంటలయింది. నెలరాజు వెన్నెలంతా భూమిపైనే కురిపిస్తూ, పుడమితల్లిపై తనకెంత ప్రేమో వ్యక్తం చేస్తున్నాడు.

అరవిచ్చిన మల్లెలు, జాజులు తమ పరిమళాలను నలువైపులా వెదజల్లుతున్నాయి. పారిజాతం చెట్టు ప్రక్కన గార్డెన్ ఛెయిర్‌లో కూర్చుంది మంజుల.

అప్పుడే వచ్చిన రవిచంద్ర స్కూటర్‌కు స్టాండ్ వేసి మంజుల కూర్చున్న దగ్గర కొచ్చి కుర్చీ లాక్కుని, కూర్చుంటూ, "మంజూ! ఉదయం హాస్పటల్ కెళ్ళావా?" అన్నాడు.

మంజుల సమాధానం చెప్పలేదు. ఆమె కళ్ళనుంచి కన్నీటి చుక్కలు మంచిముత్యాల్లా చెక్కిలిపైకి జాలువారు తున్నాయి.

"మాట్లాడవేం మంజూ?"

"వెళ్ళాను."

"డాక్టరేమంది?"

"పుట్టబోయే బిడ్డ ఆడపిల్లని చెప్పింది."

"అభివృద్ధి చెందిన శాస్త్ర పరిజ్ఞానంతో గర్భంలోని, శిశువు ఆడ, మగ కనిపెట్ట గలుగుతున్నారు. నిజంగా గర్వించదగిన విషయం."

"ఏమండీ."

"ఏమిటి మంజూ?"

"మనకొక పాపుంది కదా?" అంటూ అర్ధోక్తిగా ఆగిపోయింది.

"ఉంటే?" రవిచంద్ర కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"ఇద్దరు పాప లెందుకు? ఎబార్షన్ చేయించుకుంటాను." అంది.

ఉలికిపడ్డాడు ఆ మాటకు రవిచంద్ర. ఒక్క క్షణం తను పొరపాటుగా విన్నానా అనుకున్నాడు.

"ఈ రోజుల్లో ఇద్దరాడ పిల్లలంటే మాటలా? మీ జీతం డబ్బులు, ఉంటున్న ఈ డాబా ఇల్లు తప్ప మనకేం స్థిరాస్థులు లేవు. లక్షాధికారులే, ఒక్క ఆడపిల్ల చాలను కుంటున్నారు."

"మంజూ! ఎబార్షన్ చేయించుకుంటానని చెప్పటానికి, నీకు మనస్సెలా వచ్చింది. మన ప్రేమ ప్రతి రూపాన్ని, మన చేతులతో మనమే చంపుకుందామా?"

"మీకు సెంటిమెంట్స్ ఎక్కువ. ఆడపిల్ల అని తెలియగానే, మా చెల్లెలు, వదిన కూడా ఎబార్షన్ చేయించుకున్నారు."

"ఆడపిల్లయినంత మాత్రాన, ప్రాణాలక్కూడా తెగించి ఎబార్షన్ చేయించుకోవాలా? మంజూ! ఈ బాధంతా ఎందుకు? డెలివరీ అయింతర్వాత, ఒకేసారి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుందువు గాని."

"అబ్బాయి, లేకుండానేనా?"

"మన కిద్ద రమ్మాయిలు చాలు. అబ్బాయి లేకపోతేనేం?"

"నా కబ్బాయి కావాలి. ఇప్పుడు ఎబార్షన్ చేయించుకోను. ఈసారి అబ్బాయి పుడితే, అప్పుడు ఆపరేషన్ చేయించుకుంటాను."

మంజూను ఏమనాలో కూడా అర్థం కాలేదు రవిచంద్రకు. చదువూ, సంస్కారంలేని మనిషి కూడా కాదు. డిగ్రీ చదివింది. ఆమే అలా మాట్లాడుతుంటే ఆశ్చర్యమని పించింది రవిచంద్రకు.

నేటి సభ్య సమాజంలో, జాతీయ అంతర్జాతీయ రంగాల్లో సైతం, పురుషుల కేమాత్రం తీసిపోలేదు. అయినా ఆడపిల్ల పుట్టిందంటే, చాలా మంది తల్లితండ్రులు మానసిక క్షోభతో కృంగిపోతారు.

"అమ్మో! ఆడపిల్లా! అని భయంతో వణికిపోతారు. ఆడవాళ్ళకు, ఆడవాళ్ళే శత్రువులు. వాళ్ళకు వాళ్ళే సమస్యలను సృష్టించుకుని, అందుకు కారణం పురుషు లంటారు.

ఆడపిల్ల పుట్టిం తర్వాత, ఉయ్యాలలో వేయటం, నామకరణ మహోత్సవం జరపటం లాంటి వేడుకలప్పుడు పదిమంది ఆడవాళ్ళు ఒకచోట చేరతారు. ఆడపిల్ల తల్లిని చూస్తూ, "అమ్మాయి పుట్టిందిగా? మీ వారు నిజాయతీగా ఉంటే లాభం లేదు. అక్రమంగానయినా సంపాదించాలి. లేకపోతే ఆడపిల్ల పెళ్ళి ఎలా చేస్తారు?" అంటూ దీర్ఘం తీస్తుంది ఒకావె.

"మరొకామె, ఆడపిల్లను కన్నందుకు ఆమె ఎంతో బాధపడుతున్నట్టుగా, ఆ ఆడపిల్ల తల్లిని ఈమె ఓదార్చే ప్రయత్నంగా, "మొదటిసారేగా? ఈ సారి అబ్బాయి పుడతాడు లేమ్మా." అంటూ అనునయిస్తుంది.

నిజానికి ఇటువంటి విషయాలను గురించి మగవాళ్ళు మాట్లాడరు.

ఆడవాళ్ళే, ఆడ పిల్ల పట్ల పక్షపాతం చూపుతారు. ఒకస్త్రీ ప్రధాన మంత్రి పదవిని అలంకరించిన ఈ రోజుల్లో కూడా, ఆడపిల్ల పుట్టడం పట్ల సంతోషాన్ని చూపరు. అదే మగపిల్లవాడు పుడితే, ప్రపంచ విజేతల్లా గర్వపడేది ఆడవాళ్ళే.

"వాడంటే మగాడు. వాడితో నువ్వు సమానమా?" అంటూ అమ్మాయిల మనస్సును గాయపరిచేది తల్లే.

తను కన్న ఇద్దరు బిడ్డల పట్ల కన్నతల్లే పక్షపాతం చూపుతుంది. ఒక విషయంలోనే కాదు. ఎన్నో విషయాలలో ఆర్థికపరమయిన ఇబ్బందుల మూలంగా ఇద్దర్నీ పెద్ద చదువులు చదివించలేకపోతే, చదువు మానిపించేది ఆడపిల్లనే.

"మాట్లాడరేం?"

"ఏం మాట్లాడ మంటావు?"

"నేను అబార్షన్ చేయించుకుంటాను."

"నాకిష్టం లేదు."

"ఒక పాపుంది కదా?"

"ఉంటే, రెండో పాప ఎక్కువవుతుందా?"

"మనకున్న ఆస్తులకు, ఇద్దరాడ పిల్లలా?"

"మంజూ! నేను పేదవాడినే కావచ్చు. కానీ, నా భార్యా బిడ్డలను పోషించుకోలేని అసమర్థుణ్ణి కాదు." కోపంతో రవిచంద్ర ముఖం కందిపోయింది.

"నేనలా అనలేదు." అంది మంజుల అతనికి కోపం వచ్చిందని గ్రహించి.

"ఆశావాది విమానాన్ని తయారు చేస్తే, నిరాశావాది విమాన ప్రమాదం జరిగితే చావు తప్పదన్న భయంతో ప్యారాచుట్‌ను కనిపెట్టాడు. నీ దృష్టిలో విమానాన్ని కనిపెట్టిన ఆశావాది గొప్పవాడే కావచ్చు. నా దృష్టిలో మాత్రం నిరాశావాదే గొప్పవాడు. మనమ్మాయిలు పెళ్ళి కొచ్చేసరికి, వరకట్న సమస్యే ఉండక పోవచ్చు. లేదా వాళ్ళు కట్న కానుకల సమస్య లేకుండా వాళ్ళకు నచ్చిన వాళ్ళను ప్రేమించి పెళ్ళి చేసుకోవచ్చు. ఇప్పుడు శిశువు గర్భంలో ఉండగానే ఆడో, మగో తెల్సుకుంటున్నారుగా? అమ్మాయిలు వద్దనుకున్న నీలాంటి ఆడవాళ్ళు, ఎబార్షన్ చేయించుకుంటుంటే, కొంత కాలానికి, మన దేశంలో ఆడవాళ్ళ కొరత ఏర్పడవచ్చు. అప్పుడు, మగాళ్ళు ఆడవాళ్ళకే కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసుకుంటారేమో. భవిష్యత్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరు చెప్పగలరు?"

కళ్ళు విప్పార్చుకుని చూస్తూ కూర్చుంది మంజుల.

"మంజూ! ఆడపిల్లంటే, నీ కిష్టం లేకపోవటానికి కారణం వాళ్ళకు కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చెయ్యలేమనా? ఇంకేమయినా కారణముందా?" అన్నాడు అనునయంగా.

"అదొక భయమయితే, సరైన భర్త లభించక పోతే వాళ్ళ భవిష్యత్ ఏమవుతుందో అన్న ఆందోళన, నాకు పుట్టబోయేది ఆడపిల్ల అని తెల్సింది



ప[illegible]ంచి నాకు మనశ్శాంతి లేకుండా వె[illegible]యింది" అంది ఏడుస్తూ.

"నీ భయం అర్థంకానిది మంజూ!" అన్నాడు అనునయంగా.

"కాదండీ! రోజూ, పేపరు వార్తలు చూస్తున్నారుగా? కట్నం తేలేదన్న కోపంతో, కోడలిమీద కిరసనాయిలు పోసి నిప్పంటించారనో, కట్నం కానుకలు పూర్తిగా తేలేదని అత్తింటి వారి సాధింపులు భరించలేకా, తన పెళ్ళి చేసి అప్పుల పాలయిన పుట్టింటి వారిని ఇంకా డబ్బు ఇవ్వమని అడగలేక ఆత్మహత్య చేసుకున్న యువతి. ఇలాంటి వార్తలు చదివినప్పుడల్లా, నాకూ ఆడపిల్ల ఉందికదా? దాని భవిష్యత్తు ఎలా ఉంటుందో అని వణికి పోతానండీ. ఇప్పుడు రెండో పాపకూడా పుడితే, వాళ్ళకు కట్నాలు, కానుకలు, లాంఛనాలు అన్నీ ఘనంగా ఇచ్చి పెళ్ళిళ్ళు చెయ్యగలమా? వాళ్ళు సుఖపడ గలరా అన్న ఆలోచనలు పాము పిల్లల్లా మెలికలు తిరుగుతూ, నన్నెంత కలవరపెడతాయో మీకు తెలియదండీ."

"గర్భం ధరించగానే, మాతృత్వాన్ని పొంద బోతున్నానని ఆడది ఎంత గర్వపడుతుంది? పశువులూ, పక్షులూ కూడా మాతృత్వాన్ని పొందాలను కుంటాయే. అటువంటిది మాతృ మమకారాన్ని చంపుకుని, నేను ఎబార్షన్ చేయించుకుందామన్న నిర్ణయానికి వచ్చేముందు నాలో నేను ఎంత కుమిలి పోయానో మీకు తెలియదు." అంది కన్నీటితో.

"మంజూ! చిన్న చిన్న విషయాలను, భూతద్దంలో నుంచి చూస్తూ, ఏమేమో ఊహించుకుని, నీ ఊహలకు నువ్వే భయపడు తున్నావు."

"నేను చెప్పింది నిజం కాదంటారా?"

"ఇవన్నీ మీ ఆడవాళ్ళు సృష్టించుకున్న సమస్యలు. వాటితో వ్యాపారాన్ని పెంచుకుంటున్నాయి కొన్ని పత్రికలు. ఆడవాళ్ళంతా చెడ్డవాళ్ళు. మగాళ్ళంతా మంచివాళ్ళు అనికాదు నా ఉద్దేశ్యం. మన విషయం తీసుకో. నిన్ను నేను గానీ, మా అమ్మా నాన్నగారుగానీ బాధపెడు తున్నారా. నీ పరిధిలో వాళ్ళను చూడు. మీ చెల్లెలు, మీ మరిది, మా అక్కా, బావగారు, మీ అమ్మా, నాన్నగారు, మా అమ్మా నాన్నగారు ఎంతన్యోన్యంగా కాపురాలు చేసుకుంటున్నారు? ఎక్కడో ఒకచోట, ఎవరో ఆత్మహత్య చేసుకున్నారని, ప్రతి ఆడపిల్లకూ అలాంటి సమస్యే ఎదురవుతుందనీ, అలాగే ఆత్మహత్య చేసుకుంటుందని, ఎందుకనుకోవాలి?"

ప్రతిరోజూ, ఇలాంటి చావుల గురించి పేపర్లలో చూస్తూనే ఉంటాం."

"మంజూ! నాకు అబ్బాయి కావాలని లేదు" అన్నాడు రవిచంద్ర హాస్యంగా నవ్వుతూ.

"అబద్ధం. ఎవరయినా అబ్బాయి కావాలనే కోరుకుంటారు. నేను బాధపడుతున్నానని అలా అంటున్నారు."

"లేదు మంజూ! నిజంగా నాకు అబ్బాయి కావాలని లేదు. అబ్బాయి అయితే, వాడూ నాలాగే శ్రమపడాలి. నా పిల్లలు శ్రమ లేకుండా హాయిగా, సుఖంగా బ్రతకాలని కోరుకుంటున్నాను. అందుకే నా కబ్బాయొద్దు."

"ఏమిటి? మీరు శ్రమపడుతున్నారా? ఉదయం పది గంటల కెళతారు ఆఫీసుకు. సాయంత్రం అయిదున్నరకల్లా ఇంట్లో ఉంటారు. నెలకు పదిహేను వందలు జీతం తీసుకుంటున్నారు. అది కూడా శ్రమేనా?"

"కాదా? అబ్బాయి పుట్టాడనుకో. వాడు కష్టపడి ఏదో ఒకపని చెయ్యాలి. భార్యా బిడ్డల్ని పోషించాలి.

## అపరంజి

పుట్టకముందు
భువిలో బంది
జన్మనెత్తాక
చీకటి కొట్లో బంది

-టి. వీరాస్వామి

### "నాకూ ఆడదానిగా పుట్టాలనుంది"

అమ్మాయి పుట్టిందనుకో. దానికి నచ్చి నబ్బాయిని పెళ్ళి చేసుకుంటుంది. అతనిరక్షణలో, అతని పోషణలో, రేపు ఎలా? అన్న సమస్య, బాధా లేకుండా దాని జీవితం హాయిగా గడిచిపోతుంది."

"మంజూ! నువ్వన్నావు. ఏడు గంటలకు నిద్ర లేస్తావు. నేను నువ్వు పెట్టిన ఉడికీ, ఉడకని అన్నం తిని రెండు సిటీబస్సులు మారి ఆఫీసుకు చేరాలి. నేను ఆఫీసుకు వెళ్ళిం తర్వాత, టి.వీ చూస్తూనో, రేడియో వింటూనో, నవలలు చదువుతూనో, సమయాన్ని, నీ జీవితాన్ని కూడా నీ ఇష్టమొచ్చిన రీతిగా గడుపుతావు. నేను అయిదున్నరకు ఇంటికి రాకపోతే నీకు కోపం వస్తుందేమో అని భయం. నెలాఖరులో డబ్బు చాలకపోతే, అప్పు చెయ్యాలేమో అన్న భయం, ధరలు ఆకాశాన్నంటుతున్న ఈ రోజుల్లో, ఎవరయినా బంధువులొస్తే బడ్జెట్టు పెరుగుతుందేమోనన్న భయం. ఇలా కుటుంబాన్ని పోషించే మగాడికి ఎన్ని సమస్యలు?"

"ఏమండీ! ఆఫీసు నుంచి వస్తూ కూరగాయలు తీసుకురండి, సరుకులు అయిపోయాయి. తీసుకురండి. దసరాకు వెంకటగిరి జరీ చీర తీసుకురండి. అని గోముగా చెబుతావు. బాధ్యతలు, సమస్యలు లేకుండా నువ్వెంత హాయిగా గడుపుతున్నావు?"

"ఒకోక్క రోజు "ఈ పూట వంట చెయ్యలేనండీ. క్యారియర్ తెచ్చుకుందాం" అంటావు. అలాగే అంటాను నేను. మంజూ! శారీరకంగా బలంగా, మగాడిని సృష్టించాడే తప్ప, ఆ భగవంతుడు ప్రత్యేకతలన్ని మీకే ఇచ్చాడు. మాతృత్వపు మమకారాన్ని పొందేది మీరు. పసిబిడ్డకు పాలిస్తూ మాతృత్వపు మమకారాన్ని పొందేది మీరు. రంగుల చీరలు, రకరకాల పూలతో ముస్తాబయ్యేది మీరు. ఖరీదయిన నగలు, బాధ్యతలేని జీవితం. అన్నీ పొందేది మీ ఆడవారే."

"నా దేముంది? నువ్వు పెట్టిన భోజనం తినటం, నువ్వు చెప్పిన వస్తువులు తేవటం, కుటుంబ భారాన్ని మోయటం. నాకు కావలసిం దేముంది? సంవత్సరానికి నాలుగు జతల బట్టలు తప్ప. నేనే కాదు. ఏ మగాడి బ్రతుకయినా అంతే. అనుభూతులు, పులకరింతలు, అలంకరణలు. అన్నీ మీవే. మంజూ! ఒక్కోసారి నిన్ను చూస్తుంటే నాకేమనిపిస్తుందో చెప్పనా?" అన్నాడు నవ్వుతూ.

భర్త మాటలు విన్న తర్వాత, ఉదయం నుంచి మనస్సులో గూడుకట్టుకున్న దిగులు మాయమయి, నూతనోత్సాహం చోటు చేసుకుంది. తేలికపడిన మనస్సుతో, "ఏమనిపిస్తుంది?" అంది నవ్వుతూ.

"మరో జన్మంటూ ఉంటే, మగాడిగా కాకుండా నాకూ ఆడదానిగా పుట్టాలనుంది" అన్నాడు నవ్వుతూ.

"నాకూ అంతే అనిపిస్తుందండీ" అంది గారంగా.

"ఎబార్షన్ చేయించుకుంటావా?"

"ఊహు. పాప పుట్టింతర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంటాను. అబ్బాయి పుట్టకపోయినా ఫరవాలేదు. ఇద్దరమ్మాయిలు చాలు." అంది నవ్వుతూ.

సమ్మోహనకరమయిన ఆమె చిరునవ్వుకు, పరవశించి పోయిన రవిచంద్ర ప్రేమగా ఆమెను కౌగిలిలో ఇముడ్చుకుని ఆమె తలమీద గాఢంగా చుంబించాడు. □




